క్లుప్తంగా

'ఎస్‌జీఎస్'లో శ్రీకృష్ణ జన్మాష్టమి



భగవద్గీతను అందిస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ : ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల సంస్కృతం, తెలుగు విభాగాల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడుతూ కృష్ణ పరమాత్మ గురువులకే గురువని, సత్యం, ధర్మం, కరుణ, త్యాగం, నిస్వార్థం తదితర సద్గుణాలకు ప్రతిరూపమని వెల్లడించా రు. శ్రీకృష్ణుని స్మరించుకుంటూ, భగవద్గీతను పఠించి జ్ఞానం పొందాలని సూచించారు. అనంతరం నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీ ల్లో విజేతలకు బహుమతులు, భగవద్గీత అందజేశారు. అధ్యాపకులు కోటీశ్వరయ్య, పరమేశ్వర, కొండలరావు, శివకుమార్ పాల్గొన్నారు.

'స్టెప్ ఫర్ సక్సెస్'పై అవగాహన



మాట్లాడుతున్న యండమూరి వీరేంద్రనాథ్

తిరుపతి సిటీ : కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో స్టెప్ ఫర్ సక్సెస్ పేరిట అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ యువత లక్ష్యసాధనలో ముందడుగు వేస్తేనే స్వతంత్రంగా జీవించగలరని తెలిపారు. ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు, జ్ఞాపకశక్తి మెలకువలు, విజయానికి కావాలసిన వ్యూహాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్, అధ్యాపకులు హరి, ఎస్ఎస్‌రెడ్డి పాల్గొన్నారు

విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ : అంతర్జాతీయ యువజనోత్సవాలలో భాగంగా విజన్ ఆఫ్ వికసిత్ భారత్ అనే అంశంపై మంగళవారం నిర్వహించిన పోటీలలో పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రిన్సిపల్ నారాయణమ్మ అభినందించారు.

నేటి నుంచి 'ఇస్కాన్'లో అష్టమి వేడుకలు

తిరుపతి కల్చరల్ : ఇస్కాన్ మందిరంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతి రమణదాస్ తెలిపారు. గురువారం ఆయన వేడుకల పోస్టర్ ఆవిష్కరించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి రాధాగోవిందులను దర్శించుకోవాలని కోరారు.ఇస్కాన్ కార్యదర్శి లీలాపారాయణదాస్ పాల్గొన్నారు.

కాలువల మరమ్మతు చేపట్టాలి

తిరుపతి అర్బన్ : సమర్థవంతంగా సాగునీటిని అందించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. వీడియా కాన్ఫరెన్స్ ద్వారా నీటిపారుదలశాఖ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షించారు. అనంతరం జేసీతో పాటు డీఆర్వో నరసింహులు అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వర్షాకాలం నేపథ్యంలో చేపట్టాల్సిన అంశాలను గుర్తు చేశారు. ప్రధానంగా నీటి సంఘాలు నిర్వహించాల్సిన పనులను గుర్తు చేశారు. జిల్లాలో ఎంపిక చేసిన 20 చెరువులను సుందరీకరణ చేపట్టాల్సి ఉందని స్పష్టం చేశారు. వరద కాలువల మరమ్మతులు, పంట కాలువల తవ్వకాలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో తెలుగు గంగ చీఫ్ ఇంజినీర్ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఇరిగేషన్ ఎస్ఐ రాధాకృష్ణ పాల్గొన్నారు.

రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్‌గా అనిల్



తిరుపతి అర్బన్ : ఆర్‌సీ రోడ్డులోని రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్‌గా అనిల్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. .

మ్యాన్‌స్క్రిప్ట్ రచనపై శిక్షణ

తిరుపతి తుడా : మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్, ఎస్వీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో మ్యాన్‌స్క్రిప్ట్ రచనపై శిక్షణ శిబిరం నిర్వహించారు. గురువారం ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రభు మాట్లాడుతూ వైద్య నిపుణులు, పరిశోధకులలో శాస్త్రీయ రచనా నైపుణ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా శిక్షణ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు.

కక్షగట్టి.. పొట్టకొట్టి!

ఘనత వహించిన ఎస్వీయూ అధికారులు చివరకు తాత్కాలిక ఉద్యోగులపై కక్షగట్టారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న అకడమిక్ కన్సల్టెంట్ల పొట్టగొట్టారు. ఏళ్ల తరబడి సేవలందించారనే కనికరం కూడా లేకుండా నిర్దాక్షిణ్యంగా రోడ్డున పడేశారు. ఈ క్రమంలో ముందుగా పెర్ఫార్మెన్స్ రివ్యూ పేరిట పారదర్శకతను గాలికి వదిలి నాటకాలు ఆడారు. వర్సిటీ పాలక మండలిపై ఒత్తిడి తీసుకువచ్చి సుమారు 43 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

- ఎస్వీయూలో 43 మంది తాత్కాలిక అధ్యాపకుల తొలగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ అధికారులు కొన్నేళ్లుగా పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లను రోడ్డున పడేశారు.సుమారు 43మందిని తొలగిస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కక్ష సాధింపు చర్యలలో భాగంగా తాత్కాలిక అధ్యాపకులపై వేటు వేయాలని నిర్ణయించుకున్న అధికారులు ఫెర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో జూలైలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మేరకు తమకు అనుకూలంగా ఉన్న వారిని, ప్రజాప్రతినిధులు, మంత్రులు సూచించిన వారిని ఎంపిక చేసినట్లు వర్సిటీలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది



ఒత్తిడి తీసుకువచ్చి మరీ..!

అకడమిక్ కన్సల్టెంట్ల తొలగింపు విషయంలో వర్సిటీ పాలకమండలి ఆమోద ముద్ర వేసుకునేందుకు అధికారులు తీవ్రంగా ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఒక్క అధ్యాపకుడి కడుపు కొట్టినా ఊరుకునేది లేదని గతంలో పాలకమండలి సభ్యులు వర్సిటీ అధికారులకు తేల్చి చెప్పారు. చివరకు అధికారుల ఒత్తిడికి వారు సైతం ఆమోద ముద్ర వేయాల్సి వచ్చిందని పలువురు విమర్శిస్తున్నారు.

తొలగించిన కన్సల్టెంట్ల వివరాలు

మొత్తం అకడమిక్ కన్సల్టెంట్లు	:	249
ఇంటర్వ్యూకు హాజరైన వారు	:	241
తొలగించిన అధ్యాపకులు	:	43

స్వాతంత్ర్య దినోత్సవ కానుక ఇచ్చారు

గురువులుగా ఇన్ని రోజులు విద్యార్థులకు పాఠాలు బోధించిన మమ్మల్ని తొలగిస్తూ స్వాతంత్ర్య దినోత్సవం రోజున వర్సిటీ అధికారులు కానుక పంపారు. ఎస్వీయూలో సుమారు 5 నుంచి 20 ఏళ్ల పాటు సేవలందించిన మమ్మల్ని తొలగించడం దారుణం. మా కుటుంబాలను రోడ్డుపాలు చేశారు. ఈ వయసులో మేం ఎక్కడ పనిచేయాలి. కుటుంబాలను ఎలా పోషించుకోవాలి. ఇంత దారుణంగా అధికారులు వ్యవహరిస్తారని ఊహించలేదు. మానవతా దృక్పథంతో మళ్లీ విధుల్లోకి తీసుకోవాలి.

– తొలగించిన తాత్కాలిక అధ్యాపకులు, ఎస్వీయూ

ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశాం

వర్సిటీలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లకు ఇంటర్వ్యూలు నిర్వహించి 206 మందిని తీసుకున్నాం ఇంటర్వ్యూలో ప్రతిభ చూపని వారిని ఈసీ అనుమతితో తొలగించాం. ఇందులో ఎటువంటి ఒత్తిడి లేదు. రాజకీయ నేతల ప్రమేయం లేదు.

– భూపతినాయుడు, రిజిస్ట్రార్, ఎస్వీయూ

నోటీస్ బోర్డు

- ఎస్వీయూలోని తారకరామ స్టేడియంలో ఉదయం 8.30 గంటల నుంచి 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.
- టీటీడీ పరిపాలన భవన ఆవరణలోని మైదానంలో ఉదయం 8.30 గంటలకు స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు.
- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 7.45 గంటలకు జెండా పండుగ.
- తిరుపతి సిటీ ఛాంబర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు రుయా ఆస్పత్రి వద్ద పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ.
- ఆర్టీసీ బస్టాండ్‌లో సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభం.
- కరకంబాడి రోడ్డు, విద్యానగర్‌లోని పుష్పగిరి మఠం,

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నేడు జెండా పండుగ

తిరుపతి మంగళం : పద్మావతిపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద శుక్రవారం స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, నియోజకవర్గ సమన్వయ కర్త భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 28 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 75,859 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 33,344 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.31 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని, కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం

తిరుపతి మంగళం : ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడదామని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ, ప్రచార విభాగం నేతలతో సమావేశం నిర్వహించారు. అధికార దాహంతో నోటికి వచ్చిన అబద్ధపు హామీలు గుప్పించి కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఏడాదిన్నరగా హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ నెల 15వ తేది నుంచి మహిళలకు ఉచిత బస్సు అంటూనే అనేక ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపించారు. ఉచిత బస్సులో మహిళలకు ఎలాంటి నిబంధనలు విధిస్తున్నారన్న విషయాలను గుర్తించాలని సూచించారు. అలాగే నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా పనిచేయాలని కోరారు. సమావేశంలో పార్టీ బూత్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు యోగాంజనేయ రెడ్డి, నగర ఇన్‌చార్జి ఉప్పాళ్ల సాయి కుమారి, కోబాకు ధనంజయులు, చిట్టిబాబు, బాలసుబ్రమణ్యం, పద్మావతి, ప్రియ, ప్రచార కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేంద్ర, నగర అధ్యక్షుడు ఎస్‌వీ రమణారెడ్డి, పీర్ సాహెబ్, అయ్యన్న, ముని, హరి, జయశంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ

రామచంద్రాపురం : మండలంలోని నడవలూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు యోగానంద రెడ్డి మాతృమూర్తి ధనమ్మ ఇటీవల కన్నుమూశారు. గురువారం వారి స్వగ్రామంలో నిర్వహించిన కర్మక్రియలకు వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి హాజరయ్యారు. ధనమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. యోగానందరెడ్డి, కుటుంబీకులను పరామర్శించారు.



ధనమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భూమన

కార్బన్ పరిశ్రమపై చర్యలకు డిమాండ్

తిరుపతి కల్చరల్ : కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కార్బన్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ కార్బన్ పరిశ్రమలో వేలాది మంది కార్మికులు చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్నారని ఆరోపించారు. కనీస వసతులు కూడా కల్పించకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. కార్మికులతో అమానవీయంగా వ్యవహరిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా అధికార యంత్రాంగం తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా ఆడికృత్తిక ఉత్సవాలు

తిరుపతి రూరల్/ పాకాల : తిరుపతి రూలర్ మండలం తనపల్లె వద్ద పద్మగిరి కొండపై వెలసిన శ్రీబాలజ్ఞాన దండాయుధపాణిస్వామి, పాకాల మండలం ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ఆడికృతిక ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం పద్మగిరిలో శాస్త్రోక్తంగా ధ్వజారోహనం జరిపించారు. విజయ గణపతి హోమం చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు విజయసింహారెడ్డి, బాలచంద్రారెడ్డి, హేమంత్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆనందగిరిలో ఆలయ కమిటీ చైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్‌నాయుడు, ఈఓ యువరాణి ఆధ్వర్యంలో ధ్వజారోహణం, పార్వతీ పరమేశ్వరులకు కనుల పండువగా నందివాహన సేవ నిర్వహించారు.



పద్మగిరిపై గణపతి హోమం

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

తిరుపతి క్రైమ్ : నగరంలో సంచలనం రేపిన పవన్ కుమార్‌పై హత్యాయత్నం ఘటనకు సంబంధించి నిందితులను గురువారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ భక్తవత్సలం మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన పవన్ కుమార్పై దాడి చేసిన కేసులో నిందితులు దినేష్ కుమార్ అలియాస్ దినేష్, రేవంత్ కుమార్ అలియాస్ రాజు, అజయ్, హరికృష్ణ, ప్రవీణ్ కుమార్, మధు, కిషోర్ బాబు, సాయి కిరణ్‌ను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

పులివెందుల ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ



మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి : పులివెందుల ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని మాజీ మంత్రి ఆర్కేరోజా ఆరోపించారు. ఉప ఎన్నికలు జరిగిన తీరుపై ఆమె గురువారం ఈ మేరకు స్పందించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పులివెందుల జెడ్పీటీసీ పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 62 శాతం ఓట్లు సాధించిందన్నారు. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో జరిగిన ఎన్నికల్లోనే 62 శాతం ఓట్లు సాధించిన పార్టీకి అనుకూల వాతావరణం నెలకొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో 8.95 శాతం ఓట్లు రావడం ఏమిటన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాపితంగా అనుకూల గాలి వీచిన సమయంలో పులివెందుల జెడ్పీటీసీ పరిధిలో టీడీపీ సాధించింది 24 శాతం ఓట్లు మాత్రమే అన్నారు. అలాంటి పార్టీకి 88 శాతం ఓట్లు రావడం యావత్ రాష్ట్రాన్ని షాక్‌లో ముంచిందన్నారు. ఎన్నికల్లో పోటీచేసిన మరో ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులకి వరుసగా 0, 1, 2, 3, 4 ఓట్లు రావడం చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారన్నారు. అంటే పోటీ చేసిన అభ్యర్థి తాలుకా ఏజెంట్లు వారి కుటుంబ సభ్యులు కూడా వారికి ఓటు వేయరా?.. పోటీ చేసిన అభ్యర్థి కూడా తనకు తాను ఓటు వేసుకోడా? ఈ ఫలితాన్ని జనం ఎలా నమ్మాలన్నారు. అధికార దుర్వినియోగం, రౌడీయిజం, అవకతవకలే ఈ విజయం సాధించి పెట్టాయన్నారు.

విద్యార్థినులకు ఉపకార వేతనాలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని కెనెరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో గురువారం ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి చేతులమీదుగా ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. పీడీ మాట్లాడుతూ విద్యాజ్యోతి పథకం ద్వారా కెనెరా బ్యాంకు స్కాలర్‌షిప్‌లు అందించడం ప్రశంసనీయమన్నారు. బ్యాంకు డిప్యూటీ జీఎం రామ్మోహన్ మాట్లాడుతూ బాలికా విద్యను ప్రోత్సహించేందుకు ఈ ఏడాది 360 మంది ప్రతిభ కనబరిచిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు ఉపకార వేతనాలను అందించినట్లు తెలిపారు. ప్రాంతీయ కార్యాలయ ఏజీఎం సంజీవ్‌కుమార్, తిరుపతి సర్కిల్ ఏజీఎం రాథోడ్ కుమార్ పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్ అందిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

లారీని ఢీకొన్న ఐషర్

చంద్రగిరి: పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి అగరాల సమీపంలో గురువారం ఉదయం ముందు వెళుతున్న లారీని ఐషర్ వాహనం ఢీకొంది. వివరాలు.. చిత్తూరు జిల్లా పలమనేరు మండలం కాల్వపల్లెకు చెందిన రాజశేఖర్ కడప నుంచి సోమలకు ఐషర్ వాహనంలో పూల లోడుతో బయల్దేరాడు. ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ హఠాత్తుగా బ్రేకు వేశాడు. దీంతో ప్రమాదం జరిగింది. ఐషర్ డ్రైవర్ రాజశేఖర్ రెండు కాళ్లూ విరిగిపోయాయి. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను వెలికి తీశారు. 108లో తిరుపతి రుయాకు తరలించారు.

తిరుగులేని తిరంగా

హర్ ఘర్ కా తిరంగా ర్యాలీని తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పద్మావతి జూనియర్ కాలేజీ, జాతీయ సంస్కృత యూనివర్సిటీ, మోహన్‌బాబు విశ్వవిద్యాలయం, పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు మువ్వన్నెల జెండాలతో ప్రదర్శన చేశారు. మానవహారంగా ఏర్పడి దేశ సమైక్యతే లక్ష్యమని ప్రతినబూనారు.

– తిరుపతి సిటీ/చంద్రగిరి/ పాకాల



పద్మావతి జూనియర్ కాలేజీలో..



ఎంబీయూలో..



ఎన్ఎస్‌యూలో..